మహాప్రస్థానం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

దాహం కేకలు తప్పేనా..?

- గ్రామాల్లో మొదలైన తాగునీటి ఇబ్బందులు
- నేటికీ సిద్ధం కాని వేసవి కార్యాచరణ ప్రణాళిక
- 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీరు
- ఐదు మండలాల్లో జెఇ పోస్టులు ఖాళీ
- రిపేర్లతోనే నడుస్తున్న సిపిడబ్ల్యు స్కీమ్‌లు

జిల్లాలో ఎండల తీవ్రత క్రమేణా పెరుగుతోంది. సాధారణ రోజుల్లోనే పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో వేసవి ప్రారంభం కావడంతో నీటి సమస్యలు మొదలయ్యాయి. ప్రతి ఏడాది వేసవి సీజన్ ప్రారంభానికి ముందే ఏయే గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తుతుందో గుర్తించి, అందుకనుగుణంగా ఫిబ్రవరి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. దీంతోపాటు బావుల్లో పూడికతీత, లోతు పెంచడం తదితర కార్యకలాపాల కోసం అవసరమైన కంటిన్‌జెన్సీ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ పని చేయలేదు. ఈ ఏడాది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితి లేదని అధికారులు ఓ వైపు చెప్తున్నారు. దీంతో పల్లెవాసులకు నీటి కష్టాలు తప్పేలా లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 4037 గ్రామాలు ఉండగా కేవలం 1518 గ్రామాలకే తాగునీరు అందుతోంది. 2,519 గ్రామాలకు పాక్షికంగానే తాగునీటి సరఫరా జరుగుతోంది. జిల్లాలో 38 సమగ్ర రక్షిత మంచి నీటి పథకాలు ఉండగా, ఏ ఒక్కటీ సక్రమంగా పనిచేయడం లేదు. 918 రక్షిత మంచినీటి పథకాల పరిస్థితీ అలానే ఉంది. జిల్లాలో 15,848 చేతిపంపులు ఉన్నా, ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంలో రోజుకు 70 లీటర్ల నీటిని అందించాల్సి ఉండగా, 55 లీటర్ల నీటిని మాత్రమే అందించగలుగుతున్నారు. ఆ మేరకు తాగునీటిని అందిస్తున్న గ్రామాలు 1521 మాత్రమే ఉన్నాయి. పాక్షికంగా తాగునీరందుతున్న గ్రామాలు 2,497 గ్రామాలు ఉన్నాయి.

ఇచ్ఛాపురం మున్సిపాల్టీలోని పురుషోత్తపురంలో ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీరు

తాగునీటికి ఏం కేటాయిస్తారో..?

జిల్లాలో వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రతిపాదనలను కోరుతూ గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం అధికారులు కార్యాచరణను మొదలుపెట్టారు. ఈ ఏడాది మే, జూన్‌లోనే వేసవి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. అధికారులు పంపే ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం నిధులు కేటాయించనుంది. 2022 వేసవి కార్యచరణ ప్రణాళిక కింద రూ.80.16 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. 2021లో రూ.1.46 కోట్లు, 2020 వేసవిలో రూ.1.71 కోట్లను కేటాయించింది. ప్రభుత్వం మూడేళ్లుగా కేటాయించిన నిధులను పరిశీలిస్తే, తగ్గుతూ వస్తున్న క్రమంలో రూ.80 లక్షలకు మించి విడుదల చేసే అవకాశాలు కనిపించడం లేదు.

రిపేర్లతోనే నెట్టుకొస్తున్న సిపిడబ్ల్యు స్కీమ్‌లు

జిల్లాలో 38 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యుఎస్) ఉన్నాయి. వాటిలో ప్రతి పథకం ఏదో ఒక రిపేరుతోనే నడుస్తోంది. జిల్లాలో 38 పథకాల నిర్వహణ కోసం రూ.16.41 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీటికి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 20న పరిపాలనా అనుమతులు జారీ చేసింది. త్వరలో వీటికి టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తామని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుత వేసవి ముగిసేలోపు మరమ్మతులు చేపట్టే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో పథకాల ద్వారా తాగునీటి సరఫరా అవుతున్న గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరందే సూచనలు కనిపించడం లేదు.

జెఇ పోస్టుల ఖాళీలతో పర్యవేక్షణపై ప్రభావం

వేసవి నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్యలను తెలుసుకునే పరిస్థితి కనిపించడం లేదు. తాగునీటి పథకాల పనితీరును పర్యవేక్షించే కీలకమైన జెఇ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయలేదు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత 51 మంది జెఇలు పనిచేయాల్సి ఉండగా, 34 మంది మాత్రమే ఉన్నారు. 17 చోట్ల ఖాళీలు ఉన్నాయి. ఐదు మండలాల్లో జెఇలు లేరు. రణస్థలం, లావేరు, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో జెఇ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పక్క మండలాల్లో పనిచేస్తున్న జెఇలకు ఆయా మండలాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో తాగునీటి పథకాల నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రపంచ గమనానికి కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి

జిల్లాలో పలుచోట్ల రెడ్ బుక్స్ డే

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి / అర్బన్

కమ్యూనిస్టు ప్రణాళికతోనే శ్రామికవర్గ విముక్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. రెడ్ బుక్స్ డేను పురస్కరించుకుని జిల్లాలోని పలుచోట్ల మంగళవారం శ్రీశ్రీ మహాప్రస్థానం కవితా పఠనం చేశారు. ఇందులో భాగంగా నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 50 పేజీల కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకానికి గల ప్రాముఖ్యతకు మానవ సమాజ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర, ప్రపంచ కార్మికులారా ఐక్యం కండి, జయించడానికి మరో ప్రపంచం ఉందని ప్రజానీకానికి తెలియజేయడమే కారణమన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక మార్క్స్ ఏంగిల్స్ రాసిన పుస్తకం అని తెలిపారు. దేశంలో కార్పొరేట్ పెట్టుబడి కొండ, గట్టు, గ్రామాల్లోకి సైతం ఎలా ప్రవేశిస్తుందో, క్రోనీ క్యాపిటల్‌లిజం పేర దోపిడీ ఎలా సాగుతుందో అదానీ కుంభకోణం ఉదాహరణ అని చెప్పారు. ప్రజల ఉమ్మడి ఆస్తి అయిన ప్రకృతి సంపద కొండలు, గుట్టలు భూములు పెట్టుబడిదారుని ఆస్తిగా మారిపోతుందన్నారు. రాష్ట్రాన్ని అదానీకి కట్టబెడుతున్నారని విమర్శించారు. అదానీ కుంభకోణంపై వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకోట అప్పారావు, ఎం.ప్రభాకర్, ఎ.సత్యం, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవుల పక్షాన నిలిచిన మహాకవి శ్రీశ్రీ

శ్రమజీవుల పక్షాన నిలిచిన మహాకవి శ్రీశ్రీ అని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు అట్టాడ అప్పలనాయుడు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ప్రజాశక్తి బుక్‌హౌస్, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యాన నిర్వహించిన రెడ్‌బుక్ డే సభలో ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ మరో ప్రపంచకవి అని కొనియాడారు. మార్క్స్ కోరిన కమ్యూనిస్టు ప్రపంచ కవి అని చెప్పారు. కష్టజీవికి ఇరువైపులా నిలబడిన వాడే కవి అని చాలా స్పష్టంగా చెప్పారని అన్నారు. ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం పట్టిపీడిస్తున్న దశలో ఆకలికేకలను వినిపించిన కవి శ్రీశ్రీ అని చెప్పారు. కవిత్వం మానవాళిని అభ్యుదయం వైపు నడిపించాలని ఆక్షాంక్షించారని తెలిపారు. ప్రపంచం వెంట నడిచిన కవిగా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. శ్రమను అర్థం చేసుకోకపోతే కవిత్వాన్ని గొప్పగా చెప్పలేమని ఆయన గట్టిగా నమ్మారని తెలిపారు. ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు దేశ చరిత్ర, చేదుపాట తదితర కవిత్వాల్లో ఉన్న గొప్పదనాన్ని వివరించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ఆహ్వానం పలకగా, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రతినిధి ఆర్.ప్రకాశరావు వందన సమర్పణ చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రముఖ కవి కంచరాన భుజంగరావు, బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అట్టాడ అప్పలనాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

సుస్థిర అభివృద్ధిపై దృష్టి

రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సుస్థిర అభివృద్ధిపై దృష్టిసారించాలని రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి జి.విజయ్ కుమార్ అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్పందన కార్యక్రమంపై నగరంలోని ఒక కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పందన అర్జీలపై అధికారులు తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఇతర రాష్ట్రాలు సైతం స్పందన కార్యక్రమాన్ని అధ్యయనం చేసి తమ ప్రాంతాల్లో అమలు చేసేందుకు రాష్ట్రాన్ని సందర్శిస్తున్నాయని చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచికల ఎస్‌డిజిపై అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వాటిపై దృష్టిసారించి సకాలంలో లక్ష్యాలను సాధించాలన్నారు.

వాటి ఆధారంగానే ప్రపంచ దేశాల అభివృద్ధి, నాణ్యమైన జీవన విధానం, మానవజాతి అభివృద్ధి, జంతుజాల సంరక్షణ, దేశ, రాష్ట్రం ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుందన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా సుస్థిరమైన మానవాభివృద్ధి సాధించాలని చెప్పారు. మెరుగైన ఎస్‌డిజి అంశాలైన పేదరిక నిర్మూలన, పేదల ఆకలి తీర్చడం, ఆరోగ్య జీవనం, విద్య తప్పనిసరి చేయడం, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్, ఆర్థిక ఎదుగదల, పరిశ్రమలు స్థాపన తదితర వాటి నుంచి ఏ ఒక్కరినీ మినహాయించరాదన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ సుస్థిరాభివృద్ధి సూచీలతో మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు.

జిల్లాలో సుస్థిర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, జిల్లాలో అమలవుతున్న పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వివరించారు. శాఖల సమన్వయంతో అభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. హెల్త్ క్లినిక్స్, స్పందన అర్జీలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. అధికారులంతా దీనిపై దృష్టిసారించి పనిచేయాల్సి ఉందన్నారు.

ఆర్‌టిజిఎస్ ప్రతినిధి సృజన మాట్లాడుతూ స్పందన అర్జీలు నాణ్యతతో రిడ్రెస్ చూపించాలన్నారు. బియాండ్ ఎస్-ఎల్ఎ, స్పందనలో కొత్త ఫీచర్స్ తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి అనూష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వైద్యారోగ్యశాఖ ఉప సంచాలకులు శివశంకర్ పిల్లల్లో రక్తహీనత తదితర విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పలు శాఖలకు సంబంధించిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి, అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, సిపిఒ లక్ష్మీప్రసన్న, ఆర్‌డిఒలు సీతారామ్మూర్తి, బి.శాంతి, ఉప కలెక్టర్లు జి.జయదేవి, మురళీకృష్ణ, ఎపిసి జయప్రకాష్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు అన్యాయం

ప్రజాశక్తి - పలాస

ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రాజెక్టు కోసం భూములను త్యాగం చేసిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనల్లో భాగంగా ఆఫ్‌షోర్ రిజర్వాయరును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫ్‌షోర్ నిర్వాసితులకు అందజేసిన నష్టపరిహారం ఏమాత్రం సరిపోదన్నారు. తమ బృందం అన్ని ప్రాంతాల్లో ప్రాజెక్టుల పరిశీలన తర్వాత విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, ఇరిగేషన్ నిపుణులను ఆహ్వానించి గుర్తించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చాలా చిన్న ప్రాజెక్టులు కూడా పూర్తి చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఆఫ్‌షోర్‌కు శంకుస్థాపన చేసి 15 ఏళ్లు దాటినా అతీగతీ లేదన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోతే పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జె.వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలన్నారు. అందుకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం భూములు కోల్పోతున్న రేగులపాడు, చీపురుపల్లి నిర్వాసితులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జి.ఓబులేషు, ఎ.వనజ, జి.ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాపర సుందరలాల్, చాపర వెంకటరమణ, సిపిఐ పలాస నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో పోర్టుకు శంకుస్థాపన

- కొద్దిమంది భూములు ఇవ్వకపోతే పనులు ఆగవు
- ఇవ్వని వారిపై చర్యలు తప్పవు
- సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నౌపడ

భావనపాడు పోర్టుకు మూలపేటలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మరో నెల రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో గుర్తించిన రెవెన్యూ, ప్రభుత్వ భూములపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఐదు బృందాలుగా సర్వే చేసి 161 మంది రైతులకు పరిహారం పంపిణీ చేసినందుకు గుర్తించినట్లు తెలిపారు. వాటి వివరాలను నోటీసు బోర్డులో పెట్టామన్నారు. సర్వే నంబరు 194లో 19 మంది రైతుల నుంచి 8.50 ఎకరాలు, 157లో 23 మంది రైతుల నుంచి 8.27 ఎకరాలు, 298లో 37.36 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. వీరికి త్వరలోనే అవార్డులు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. రైతుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములు కావడం వల్ల ఎకరాకు ఎంత పంపిణీ చేస్తారన్నది ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇదివరకే 70 శాతం మందికి వ్యవసాయ భూములను సేకరించి పరిహారం చెల్లించామన్నారు. మిగిలిన వారు భూమి పత్రాలను అందజేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. పరిహారం వద్దని, భూములు ఇవ్వము అనుకుంటే కాగితం మీద రాసి ఇచ్చేస్తే తామే తీసుకుంటామన్నారు. ఏదో కొద్దిమంది భూములు ఇవ్వకపోతే పనులేవీ ఆగవని, వాళ్లపై తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిడిఎఫ్ గుర్తింపులో పలువురు అభ్యంతరాలు లేవనెత్తారు. వారికి సమాధానం ఇస్తూ రికార్డుల ప్రాతిపదికన 18 ఏళ్లకు ఒక్కరోజు తగ్గినా పిడిఎఫ్ గుర్తించేది లేదని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక్కో పిడిఎఫ్‌కు రూ.9.91 లక్షల పరిహారం అందిస్తామన్నారు. దీనిపై కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేసినా చట్ట ప్రకారమే ముందుకెళ్తామని తెలియజేసి సభను ముగించారు. గ్రామసభకు టెక్కలి సిఐ చంద్రమౌళి ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, సర్పంచ్ బాబూరావు, నక్క భీమారావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

యువత చేతుల్లోనే తెలుగు భవిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతృ భాషను బతికిస్తూ ఆంగ్ల భాషనూ నేర్చుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అన్నారు. కళాశాలలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష భవిష్యత్ యువతరం చేతుల్లోనే ఉందన్నారు. తెలుగును బతికించడంలో సాహిత్యం గొప్ప పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యార్థులు సాహిత్య రంగంలోకి రావాలని కోరారు. అరసం, ఇస్కఫ్ సంస్థలతో కలిసి తమ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ అంతరించిపోయే భాషల్లో తెలుగు ఒకటని హెచ్చరించారు. తెలుగు భాష ఉదారమైందని, పర్షియన్, ఇంగ్లీష్ పదాలు చొరబడ్డాయని సోదాహరణంగా వివరించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, తెలుగు విభాగం అధిపతి ఎం.శ్రీనివాసరావు, ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నర్సింహులు, జిల్లా అధ్యక్షులు ఎం.వి మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షులు బుడుమూరు శ్రీరామ్మూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, కళాశాల అధ్యాపకులు సిహెచ్.కృష్ణారావు, కె.గిరిజ, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని వాహనాలు సీజ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వాహన తనిఖీలు చేస్తున్న శ్రీధర్

వాహనాలకు సంబంధించిన పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్ కోరారు. నాన్ పేమెంట్ డ్రైవ్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహన పన్ను సకాలంలో చెల్లించని వాహనాలను ప్రత్యేక డ్రైవ్‌లో సీజ్ చేయడం, ఎక్కువ మొత్తంలో అపరాధ రుసుం విధించే అవకాశం ఉందన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ నంబర్లు లేని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సురక్షితమైన వాహనాల్లోనే ప్రయాణం చేయాలని సూచించారు.

అలా అయితే రాజీనామాకు సిద్ధం

- కేబినెట్ కూర్పులో సిఎంకు ఇబ్బంది ఉంటే తప్పక చేస్తా
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేబినెట్ మార్పు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విచక్షణాధికారమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. సామాజిక తరగతుల ఆధారంగా కేబినెట్ కూర్పు ఉంటుందని, అందులో ముఖ్యమంత్రికి ఏమైనా ఇబ్బంది ఉంటే తాను రాజీనామాకు సిద్ధమన్నారు. నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలందరూ మంత్రి స్థాయి వారేనని చెప్పారు. మత్స్యకారులకు ముఖ్యమంత్రి ఎంతో గౌరవం ఇచ్చారని, ఇంతకంటే తనకేం కావాలన్నారు. రాష్ట్రంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు సామాజిక న్యాయం చేకూరుస్తున్నారని కొనియాడారు. శాసనమండలిలో 44 మంది వైసిపి సభ్యులుంటే, అందులో 30 మంది బిసిలేనని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 18మంది సభ్యులే బిసిలు ఉండేవారని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు బిసి ద్వేషి అని ఆరోపించారు. నవరత్నాల ద్వారా బిసిలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తుంటే నిధులు ఇవ్వవద్దంటూ కేంద్రానికి చంద్రబాబు లేఖలు రాశారని తెలిపారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బిసిలను అణగదొక్కే చర్యలకు పాల్పడ్డారని వివరించారు. చివరకు ఆయనకు అధికారం పోయి ప్రతిపక్షంలో ఉన్నా సరే బిసిలపై ఆక్రోశం తగ్గలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఉపయుక్తంగా ఉన్న ఇంగ్లీష్ మీడియం తెస్తుంటే అడ్డుకోవాలని చూశారని చెప్పారు. చట్టసభల్లో బిసిలకు 34శాతం కోటా ఇస్తామంటే కోర్టుకు వెళ్లారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు టిడిపిని మట్టి కరిపించాలన్నారు. అంటరానితనం వెనుకబాటుతనం ఇవన్నీ జగన్ పాదయాత్రలో చూశారని చెప్పారు. సామాజిక అసమానతలు తగ్గాలంటే జనాభా ప్రాతిపదికన పదవులు ఇవ్వాలని నిర్ణయించారని, అందులో భాగంగానే ఆయా తరగతులకు పదవులు ఇచ్చి ముందువరసలో కూర్చోబెడుతున్నారని కొనియాడారు. లోకేష్‌కు జగన్‌ని విమర్శించే స్థాయి లేదన్నారు. గన్నవరం గొడవలకు చంద్రబాబే సూత్రధారి అని ఆరోపించారు. సమావేశంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైసిపి నాయకులు శిమ్మ రాజశేఖర్, కోత పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

రాజకీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా పదవులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో జనాభాకు తగ్గట్టుగా వారి రాజకీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదవులు ఇస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. అనంతరం రామారావుతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. రామారావు సుదీర్ఘ కాలంగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నారని, ఆయన కల నెరవేరిందన్నారు. గతంలో ఎన్నో అవమానాలకు గురైన సామాజిక తరగతులు ఇప్పుడు చట్టసభల్లో మాట్లాడే అవకాశం దక్కించుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట ప్రకారం చట్టసభల్లో వెనుకబడిన తరగతుల సమస్యలు వినిపించుకునేందుకు అవకాశం ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలోని యాదవులంతా జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రామారావు సమర్థంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈనెల 22న మధ్యాహ్నం రెండు గంటలకు నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. నర్తు రామారావు మాట్లాడుతూ యాదవులందరినీ ఏకతాటి పైకి తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్, నర్తు చామంతి తదితరులు పాల్గొన్నారు.

నర్తు రామారావును అభినందిస్తున్న ధర్మాన

DOCUMENT LOST

Smt. Nikku Satyavathi, Budithi (Village & Post), Saravakota Mandal,Srikakulam District, Andhra Pradesh - 532 427
On 06.01.2023, while travelling from **Budithi Village to Narasa nnapeta,** I lost the below document 1. Original Sale Deed Document bearing Number **4766/2014** Dated 17th July 2014 issued by S.R.O Rajendra Nagar, Hyderabad bearing name Smt. Nikku Satyavathi & Sri. Venkata Gopi Krishna Nikku and address Flat No: 101, Block–B,Kendriya Vihar Phase – III, Hydershakote,Hyderabad - 500091, Telangana state.

If someone has found this Document, Please Contact:

83319 71851

పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

రాష్ట్రంలో అరాచక పాలన

పొందూరు : వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చివేశారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. మండలంలోని బొడ్డేపల్లిలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రానికి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపికి పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక ఈ విధంగా కేసులతో వేధిస్తున్నారని విమర్శించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యం, టిడిపి నాయకులు బలగ శంకరభాస్కరరావు, సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, గాడు నారాయణరావు, బాడాన శేషగిరినాయుడు, మొదలవలస సీతారామారావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న పోస్టల్ సిబ్బంది

ఒత్తిడికి గురిచేయడం సరికాదు

ప్రజాశక్తి- పలాస

పోస్టాఫీసుల్లో పిఒఎస్‌బి మహామేళా ఈ నెల 20 నుంచి 24 నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా 50 ఖాతాలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఎన్‌ఎఫ్‌పిడి జిడిఎస్ ఉద్యోగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.నందికేశవరావు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక పోస్టాఫీస్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని అశాస్త్రీయమైన లక్ష్యాలు చేయమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర సంఘం నాయకులు జనరల్ సర్కిల్ పోస్టుమాస్టర్‌కు వినతిపత్రం అందించామని అన్నారు. అయినా ఒత్తిడి పెంచుతున్నారని పేర్కొన్నారు. వేధింపులు ఆపకుంటే విజయవాడ సర్కిల్ ఛీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం ఎదుట తపాలా ఉద్యోగులు మార్చి 9న మహా ధర్నా చేయడానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.వేమన, తేనేశ్వరరావు, ప్రకాశరావు, రాజేష్, దుర్యోదన, శ్రీనివాసరావు, పలాస-కాశీబుగ్గ, అక్కుపల్లి, బ్రాహ్మణతర్లా, పూండి తపాలా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నా పట్టించుకోరా..?

- తాడివలసలో ప్రమాదకరంగా పాఠశాల తరగతి గదులు
- గాయాలపాలవుతున్న విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- పొందూరు

ఎప్పుడు ఏ పెచ్చు ఊడి తలపై పడుతుందోనంటూ బిక్కుబిక్కుమంటూ పాఠాలను వింటున్నారు. శిథిలమైన తరగతి గదుల్లో తమ భద్రతను చూసుకోవాలో.. లేక పాఠాలను నేర్చుకోవాలో తెలియక తీవ్ర ఆందోళనల నడుమ అభ్యసిస్తున్నారు తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు.

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదుల్లో భయాందోళనల నడుమ విద్యార్థులు చదువులను సాగిస్తున్నారు. 45 ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదుల్లోనే పాఠాలను బోధిస్తున్నారు. దీంతో శ్లాబ్ పెచ్చులూడి పైన పడుతుండడంతో గాయాలకు గురవుతున్నామంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులు తరగతి గదిలో పెద్ద ఎత్తున శ్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. ఉదయం ప్రార్థనా సమయంలో ఆ పెచ్చులూడి పడడంతో ప్రమాదం తప్పింది. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకూ సుమారు 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 45 ఏళ్ల క్రితం నిర్మించిన నాలుగు తరగతి గదుల్లో పాటు, ఐదు రేకుల షెడ్డుల్లో పాఠాలను బోధిస్తున్నారు.

వినియోగానికి నోచుకోని నూతన తరగతి గదులు

సుమారు రెండేళ్ల క్రితం పాఠశాలలో నూతనంగా నిర్మించిన నాలుగు తరగతి గదులు వినియోగానికి నోచుకోకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ.43 లక్షలతో పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులను నిర్మాణం జరిపారు. కానీ, వాటికి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ తరగతి గదులకు తాళం వేశారు. అధికారులు స్పందించి కాంట్రాక్టరు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించినట్లయితే ఈ తరగతి గదులను వినియోగించుకోవచ్చునంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు.

ప్రారంభం కాని నాడు-నేడు పనులు

పాఠశాలలో నాడు-నేడు రెండో దశలో సుమారు రూ.1.20 కోట్లతో పనులను అధికారులు మంజూరు చేశారు. కానీ, పాఠశాల మోనటరింగ్ కమిటీ లేదంటూ పనులు చేపట్టలేదు. కానీ, ప్రస్తుతం పాఠశాలలో కమిటీ ఏర్పాటు అయినప్పటికీ ఇప్పటికీ పనులను అధికారులు ప్రారంభించలేదు. అధికారులు ప్రత్యేక దృష్టినిసారించి పాఠశాలలో నాడు-నేడు పనులను చేపట్టాలంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే శిథిలమైన తరగతి గదుల్లో పాఠశాలను బోధించడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదని, అందుకే ఇప్పటికే నిర్మించి ఉన్న అదనపు తరగతి గదులను వెంటనే వినియోగంలోకితీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులూడిన శ్లాబ్

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో శిథిలమైన తరగతి గదుల్లోనే బోధించాల్సి వస్తుంది. ఈ తరగతి గదులు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మంగళవారం కూడా విద్యార్థులు లేని సమయంలో పెచ్చులూడి పడడం వల్ల ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి మరలా తీసుకువెళ్తాం.

- లఖినాన హేమనాచార్యులు, హెచ్‌ఎం

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: 'మా నమ్మకం నువ్వే జగనన్న' అంటూ రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిని తమ గుండెల్లో పెట్టుకుంటున్నారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకిలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో జెసిఎస్ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు మంగళవారం నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు, వైసిపికి మధ్య వారధిగా గృహ సారథులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పథకాలు అందని ఏ ఒక్క అర్హునికీ నష్టం జరగకూడదని చెప్పారు. శాసనమండలి సభ్యుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సామాజిక సమతూకాన్ని మరోసారి పాటించి, బిసిలంటే బ్యాక్వర్డ్ క్లాస్ కాదని నిరూపించారన్నారు. నర్తు రామారావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం వల్ల యాదవలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లయిందని వివరించారు. జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ 'నువ్వే మా నమ్మకం జగన్' అని ఉన్న స్టిక్కర్ అతికించాలని సూచించారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ భైరాగినాయుడు, కణితి కృష్ణారావు, చింతాడ ఉమామహేశ్వరరావు, చింతాడ వెంకటరావు, ముద్దాడ మురళీనాయుడు, కోట అప్పారావు, కలగదండు పాపారావు, కణితి సత్తిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాస్వామ్యం అపహాస్యం

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుండ లక్ష్మీదేవి

ఎన్‌టిఆర్ కృష్ణా జిల్లా గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ అనుచరులు, రౌడీ షీటర్లు దాడులు చేస్తూ విధ్వంసానికి పాల్పడ్డారని, బాధితుడికి తోడుగా నిలిచిన టిడిపి నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేయడం చేయడం హేయమైన చర్యని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ధ్వజమెత్తారు. అరసవల్లిలోని ఆమె స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి గూండాలు చేస్తున్న అరాచక పర్వం చూస్తుంటే రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. మరో వారికి సిఎం జగన్ పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పర్యటనలు, లోకేష్ పాదయాత్రలకు వస్తున్న ప్రజలను చూసి జగన్‌కు భయం పట్టుకుందని అన్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతి చెందిన ప్రభాకర్

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడికి సమీపం రాజ్‌పూర్ వద్ద మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. గుసాన బ్లాక్ ఉప్పలాడ పంచాయతీకి చెందిన తంగుడు ప్రభాకర్ (52) ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. జాజ్‌పూర్ వద్ద సిమెంట్ గొడౌన్ పక్కన ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనపై పర్లాకిమిడి మోడరన్ పోలీస్ స్టేషన్ ఐఐసి వివేకానంద సోయ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన ప్రకాశరావు

వాలంటీరుకు గాయాలు

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు-కె గ్రామ సచివాలయ వాలంటీరుగా పనిచేస్తున్న ప్రకాశరావు సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం మర్రిపాడు నుంచి పాతపట్నం వైపు బైక్‌పై వెళ్తుండగా... మెళియాపుట్టి వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కింద పడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే స్థానికులు పాతపట్నం సిహెచ్‌కి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ జి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని దంతకు చెందిన బొమ్మాళి రవి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన సూరపు గోవిందరావుపై ఎస్‌సి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.కె.మహ్మద్ అలీ తెలిపారు. బొమ్మాళి రవి ఏడాది క్రితం సూరపు గోవిందరావుకు రూ.6 వేలు అప్పుగా ఇచ్చారని అన్నారు. గోవిందరావు పనులు నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటూ శివరాత్రి పండగ సందర్భంగా గ్రామానికి వచ్చారని పేర్కొన్నారు. దీంతో రవి తనకు అప్పుగా ఇచ్చిన డబ్బులు సోమవారం అడిగారని తెలిపారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుందని పేర్కొన్నారు. గ్రామస్తులు సర్దిచెప్పినా వినకుండా రాత్రి మూడు గంటల రవి ఇంటికి వెళ్లి కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడని గోవిందరావు ఫిర్యాదు చేశారని తెలిపారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

లక్ష్మణరావుపై ఫిర్యాదు

మందస : స్వాతంత్ర సమర యోధుడు గౌతు లచ్చన్నపై వైసిపి నాయకులు బత్తిన లక్ష్మణరావు చేసిన వ్యాఖ్యలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మందస మండల టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మందస పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి లచ్చన్నపై చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. మండలంలోని బేతాళపురానికి చెందిన లక్షణరావు లచ్చన్నపై కించపరుస్తూ చేసిన వ్యక్తులు సరైనవి కావని సూచించారు. ఫిర్యాదు చేసిన వారిలో దాసరి తాతారావు, భావన దుర్యోధన, రత్తి లింగరాజు, జి.కె.నాయుడు, నవీన్ పాల్గొన్నారు.

టాంజానియాలో జిల్లా వాసి మృతి

సోంపేట : మండలంలోని పాలవలస పంచాయతీ పరిధి కుమ్మరపాడుకు చెందిన శివంగి యాదవరావు (38) ఆఫ్రికాలోని టాంజానియాలో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన ఐదేళ్లుగా అక్కడి సా మిల్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. మృతుడు కొన్నేళ్లుగా సుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. షుగర్ ఎక్కువ కావడంతో అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే అక్కడి సహచరులు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతునికి భార్య కృష్ణవేణి, పిల్లలు కావ్య, శ్యామసుందర్ ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

కోటబొమ్మాళి: జాతీయ రహదారికి అనుకొని కోటబొమ్మాళి, పోలాకి, సంతబొమ్మాళి, సారవకోట, నరసన్నపేట మండలాలకు చెందిన ప్రయాణికులకు ఉపయోగపడుతున్న హరిశ్చంద్రపురం రైల్వేస్టేషను అభివృద్ధి చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైజలసత్యనారాయణ, నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజర్ కార్యదర్శి కోట సంతోష్ (సుధీర్)లు ఎంపీతో కలిసి విశాఖపట్నం డిఆర్ఎం అనుప్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయాలని కోరారు. జిల్లాలని దండుగోపాలపురం, కోటబొమ్మాళి ఆర్ఎస్, తిలారు, ఉర్లాం, పొందూరు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజర్ కమిటీ సభ్యులు సాసుమతు ఆనందరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

వమరవల్లి డైట్ లెక్చరర్ అప్పన్న

అవగాహన కల్పిస్తున్న అప్పన్న

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని వమరవల్లి డైట్ లెక్చరర్ అల్లు అప్పన్న అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురపాలక సంఘ ఉన్నత పాఠశాల లక్ష్మీనగర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షా పర్వ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, బాలల హక్కుల కమిషన్, ఎస్‌సిఇఆర్‌టి, సమగ్ర శిక్షా అభియాన్, ప్రభుత్వ జిల్లా విద్యాశాఖ సంస్థ సమన్వయంతో పది విద్యార్థులు ఒత్తిడిలు లేకుండా సులభంగా పరీక్షలు రాయడానికి కావాల్సిన మెళకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా డైట్ లెక్చరర్ అప్పన్న తనదైన శైలిలో సందర్భోచిత ఉదాహరణతో చక్కని కథలతో విద్యార్థులు పరీక్షలు రాయడానికి సంసిద్ధులను చేశారు. పది తర్వాత మంచి కెరియర్ అవకాశాలను, కోర్సులను ఎంపిక చేసుకుని ఉన్న తక్కువ సమయంలో సరైన ప్రణాళిక ఏర్పాటు చేసుకొని విజయవంతంగా పరీక్షలు ముగించాలని తెలిపారు. పాఠశాలను జిల్లాలో ప్రథమ శ్రేణిలో నిలపాలని, ఆ క్రమంలో ప్రతి ఒక్క విద్యార్థీ తనే ప్రథమ స్థానంలో నిలబడాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.వి.రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రస్తుత పరీక్షా సరళిని అర్థం చేసుకోవాలన్నారు. అన్ని విషయాలపై సమగ్రంగా అవగాహన పెంచుకుని ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి శారీరక, మానసిక ఒత్తిడిలకు గురికాకుండా ఉండాలని సూచించారు. ఎంఇఒ, దుప్పల రామారావు, ఎపిఎం పైడి కూర్మారావులు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి అంశాన్నీ గుర్తుంచుకొని చక్కగా పరీక్షలు రాయాలన్నారు. ఉజ్వలమైన భవిష్యత్‌కు మార్గం వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.వెంకటరమణ, కె.అప్పలనాయుడు, బి.సూర్యనారాయణ, జి.సుదర్శనరావు, వి.గోపీకృష్ణ, ఎం.శ్యామలరావు, కె.లత, ఎ.శారద, బి.శ్యాంసుందరరావు, పి.కృష్ణ, వి.శ్రీధర్, బి.శ్రీనివాసరావు, పి.రవిశంకర్, ఎన్.వి.రమ, టి.భారతి పాల్గొన్నారు.

నీటిని సరఫరా చేయాలని వినతి

ప్రజాశక్తి- పలాస

పలాస జ్యోతిరావు పూలే గురుకులంలో 202 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి సరిపడా నీటిని సరఫరా చేయాలని ఆరోగ్య పరి రక్షణ కమిటీ నాయకులు బి.ఓంకార్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయంలోని ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల భవనం అద్దె భవనంలో నడుస్తుందని, భవనంలో బోర్లు ఉన్నా పూర్తిస్థాయిలో నీరు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులపై పాలకుల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాలను వేరేచోటకు మార్చాలని, లేనియెడల నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తునన ఓంకార్, ఆనందరావు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఆత్మహత్య చేసుకున్న గిరిజన యువకుడు ఎన్.దిలీప్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మక అప్పన్న, సవర ధర్మారావులు కోరారు. మండలంలోని కాకరగూడ పంచాయతీకి చెందిన నిరుద్యోగు యువకుడు దిలీప్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న వీరు మంగళవారం మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ వేయడంతో విఫలమైందన్నారు. ఉద్యోగ ప్రకటనలో స్పష్టమైన విధానం ప్రకటించకపోవడంతో యువకులు నిరాశ చెందుతున్నారని అన్నారు. వీరితో పాటు గిరిజనులు రామకృష్ణ, సోమేష్‌లు ఉన్నారు.

పరామర్శిస్తున్న నాయకులు

మండల సమావేశానికి

ఎన్నికల కోడ్ అడ్డు

ప్రజాశక్తి- పలాస

పలాస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన మండల సమావేశానికి ఎన్నికల కోడ్ అడ్డు తగిలింది. సమావేశానికి ఎంపిపి ఉంగ ప్రవీణతో పాటు మండల సభ్యులు హాజరయ్యారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మండల సమావేశంలో అంశాలపై చర్చించేందుకు వీలుకాలేదు. దీంతో సభ్యులు రికార్డులపై సంతకాలు పెట్టి వెనుదిరిగారు. సమావేశంలో చేయాల్సిన తీర్మానాలను వాయిదా వేశారు.

మెటీరియల్‌ను అందజేస్తున్న గోవిందరావు

మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం ఆదర్శ జూనియర్ కళాశాలలో శ్రీశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎంసెట్, నీట్, జెఇఇ మెయిన్స్ కాంపిటేటివ్ పుస్తకాలను టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులకు సమాజపంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదిస్తే తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ చిందు శ్రీకాంత్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, స్కూల్ చైర్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

జలుమూరు: మండలంలోని నగిరికటకం పంచాయతీ పరిధి దోమనాపల్లికి చెందిన మెండ మోహనరావు ఇటీవల ఎస్ఐ ఉద్యోగ పరీక్ష రాసేందుకు కర్నూలు వెళ్లి రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామం తీసుకువచ్చి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు తెలంగాణ ఎఆర్ పోలీసులు ఆర్.గోపాల్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ పి.పారినాయుడు పాల్గొన్నారు.

తండ్యాంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో తండ్యాంలో తాడివలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జి.రమేష్‌నాయుడు ఆధ్వర్యాన మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు, బాలింతలలకు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ హర్షిత, ఎఎన్ఎం పి.సుశీల, హెచ్ఎస్ బెనర్జీ, హెచ్.వి.రాములు, హెల్త్ అసిస్టెంట్ జె.లక్ష్మీనారాయణ, డిఇఒ శ్రీనివాసరావు, ఆశాకార్యకర్తలు అన్నపూర్ణ, మణికుమారి, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రమేష్‌నాయుడు

తేనెలొలుకు తెలుగు భాష

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న కృష్ణమూర్తిరెడ్డి

కవిటి : తేనెలాంటి మధురమైనది తెలుగు భాషని బి.గొనపపుట్టుగ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఖగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా హైస్కూల్‌లో జాతీయ గీతంపై పోటీలు నిర్వహించారు. పోటీ ప్రపంచంలో ఆధునికత పేరుతో విద్యార్థులు మాతృభాష విలువ తెలుసుకోవడం లేదని, కనీసం ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో మాతృభాషపై మమకారం పెంపొందించాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని అద్దానంపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మాతృభాష దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి, ఉపాధ్యాయులు సీతమ్మ పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక వేషధారణలు వేశారు.

లావేరు : మాతృభాష కన్నతల్లి వంటిదని, జన్మభూమిని మామృభాషను మరవకూడదని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయం ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మాకన వాణిశ్రీకి ప్రథమ బహుమతి, టి.సురేష్‌కు ద్వితీయ, ఎం.రామారావుకు తృతీయ బహుమతులు వచ్చాయి. అనంతరం గ్రంథాలయం తరుపున వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నీలిమ, ప్రిన్సిపాల్ బాలరాజు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుక నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు వైవిసిహెచ్ లీలాపద్మజ, వి.తిరుమలరావు, వి.లూక్‌పాల్, ఎ.రామారావు, ఓ.కోటేశ్వరరావు, టి.త్రినాథరావు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ సాయి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో జనజాగృతి ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ఈశ్వరరావు, కవి బమ్మిడి సుబ్బారావు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షులు బండారి కాళిదాసు, కోశాధికారి బత్తిని బాలకృష్ణవర్మ, గౌరవ సభ్యులు నెమలిపురి అప్పారావు, కె.భావన్నారాయణరెడ్డి, జయంతి గజలక్ష్మి, టి.బాబూరావు, డి.జయరాం, చెల్లూరు శంకరరావు పాల్గొన్నారు.

జాయ్ కిడ్స్ స్కూల్‌లో...

శ్రీకాకుళం అర్బన్ : మాతృభాష అమ్మతనాన్ని గుర్తు చేస్తుందని జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ జామి స్రవంతికిరణ్ అభిప్రాయపడ్డారు. స్కూల్ ఆవరణలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులతో తెలుగు తల్లి నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం : పలు వేషధారణల్లో విద్యార్థులు

టెక్కలిలో...

శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కుమార్‌రాజా

జిల్లా గ్రంథాలయంలో...

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు తల్లి చిత్రపటానికి కార్యదర్శి బి.కుమార్‌రాజా పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, చిరంజీవులు, యోగానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాంతి నికేతన్ విద్యా సంస్థలో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి అధ్యక్షతన మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ భాషాకు మించిన భాషా ప్రపంచంలో మరేదీ లేదని పేర్కొన్నారు. ముందుగా భారత్‌మాత విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఇంట్రాక్టు క్లబ్ సభ్యులు కె.సి.పూరి, సురేఖ, పద్మజ, శ్రీధర్, శంకర్, త్రిష, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కేబుల్ ఆపరేటర్లు

కేబుల్ ఆపరేటర్ల ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కార్పొరేటు సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ట్రాయ్ నిబంధనలతో గ్రామీణ కేబుల్ ఆపరేటర్లకు తీరని నష్టం వాటిల్లుతుందని, తక్షణమే ట్రాయ్ విధానాలను మార్చి కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థను పరిరక్షించాలని సంఘం ప్రతినిధులు రామారావు, కిరణ్, ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థ తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు వినోదం పేరుతో ప్రజలపై పెద్దఎత్తున భారం పడుతుందన్నారు. తక్షణమే నిబంధనలు మార్చి కేబుల్ ఆపరేటర్లను కాపాడాలని కోరారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రెండు నెలలు అవుతుందని, ఇప్పటికీ రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సనపల అన్నాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి 21 రోజుల్లో రైతుల ఖాతాలలో డబ్బులను జమ చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. మడమ తిప్పను మాట తప్పను అన్న ముఖ్యమంత్రి మాటలు నీటి మూట లేనని ఎద్దేవా చేశారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న కన్వీనర్లు

ఎమ్మెల్యేకు సన్మానం

కొత్తూరు : వైసిపి మీడియా కమిటీ కన్వీనర్లు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఇటీవల మీడియా కమిటీ కన్వీనర్లను నియమించారు. ఈ మేరకు పిఎసిఎస్ ఛైర్మన్ చింతాడ సూర్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకం కలిగిసి దుశ్శాలువ కప్పి సన్మానించార. అనంతరం పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మీడియా కమిటీ కన్వీనర్ జి.చిన్నబాబు, కో-కన్వీనర్లు సతివాడ సుదర్శనరావు, విశాఖ సూరిబాబు, యజ్జల వినోద్, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు లోతుగెడ్డ తిరుపతిరావులు పాల్గొన్నారు.

స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా జోగినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రతిష్టాత్మకమైన వాకర్స్ క్లబ్‌గా పేరుగాంచిన నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఎన్నుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కౌన్సెలర్-1 కూన వెంకటరమణమూర్తి సారథ్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. 2023-24కు గాను నూతన కమిటీ అధ్యక్షుడిగా రెండో సారి శాసపు జోగినాయుడు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గోలీ సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షునిగా సింహాద్రి వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.నారాయణరావు, కోశాధికారిగా బి.దేవీప్రసాద్, గౌరవ అధ్యక్షునిగా జి.ఇందిరాప్రసాద్, డైరెక్టర్లుగా కూన వెంకటరమణమూర్తి, రత్నాల వరప్రసాద్, బి.వి.రవిశంకర్, పి.జి.గుప్తా, ఎస్.సంజీవరావు, చలపాక సూర్యారావు, గొర్లె వాసుదేవరావు, పూన్న కామేశ్వరరావు, గురు ఆనందరావు, గుడ్ల జగ్గారావు, మెట్ట దనుంజయబట్లు, శాసపు అప్పలనాయుడు, బొడ్డేపల్లి ప్రసాదరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటి నుంచి డోలోత్సవాలు

ప్రజాశక్తి- కవిటి

ఉద్దాన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం, కొంగు బంగారం శ్రీదేవి భూదేవి సమేత చక్ర పెరుమాళ్‌స్వామి డోలోత్సవాలు బుధవారం నుంచి వైభవోపేతంగా ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 22 వరకు ఫాల్గుణ శుద్ధ తదియ మొదలు కొని ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి మార్చి 7 వరకు అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. అనంతరం 8న డోలోత్సవం, కామదహనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన యాత్రికుల సహకారంతో హరికథలు, గరుడ సేవలు, పల్లకి ఉత్సవం నిర్వహిస్తుంటారు.

రాతితో ఆలయ నిర్మాణం

పొందల వంశీయులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణంలో సిమెంట్‌ను ఉపయోగించకుండా శిల్పులతో చెక్కించబడిన రాతితో ఆలయ గర్భగుడి నుంచి గరుడ స్తంభం వరకు నిర్మాణం చేశారు. అనంతరం ఆలయ ముందు భాగం, మండప నిర్మాణం 1955లో మాదిన సింహాద్రి ఆధ్వర్యాన పూర్తి చేసుకున్న చక్ర పెరుమాళ్ స్వామి ఆలయం ఓ అద్భుత పుణ్యక్షేత్రంగా వెలసింది.

చక్ర పెరుమాళ్ల ఆలయం

ఇటీవల కాలంలో..

మరోవైపు ఆలయ ప్రాంగణంలో గతంలో ఉన్న కన్నబాబు కళ్యాణ క్షేత్రాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు నిధులతో పునర్నిర్మించారు. అంతేకాకుండా గ్రామస్తులు, దాతల సహకారంతో ధ్రువమూర్తులు, యాగశాల నిర్మాణం, గ్రామానికి చెందిన బార్ల దనుంజయం దంపతుల ఆర్థిక సహకారంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేసి 2022 ఫిబ్రవరి 19న వైభవంగా ప్రతిష్టించారు.

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న పూర్ణచంద్రరావు

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మంగళవారం పలువురు ప్రముఖులు సందర్శించారు. బిజెపి రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్.నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అలాగే విజయవాడ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కూడా సందర్శించారు. వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామి వారి సేవల అనంతరం వారికి శేష వస్త్రాలను కప్పి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని...

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామిని బిజెపి రాజ్యసభ సభ్యుడు నరసింహారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే ఆలయానికి ఉత్తర దిక్కునున్న వారాహి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ శిఖర దర్శనం చేసుకున్నారు. ఆలయ గోడలపై ఉన్న శిల్ప సౌందర్యాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

ఫ్లెక్సీల తొలగింపు

పొందూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పొందూరు మేజర్ పంచాయతీలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఇఒ కె.రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది తొలగించారు. పంచాయతీ పరిధిలోని బస్టాండ్, అంబేద్కర్ కూడలి, రాపాక కూడలిలో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను నాయకులు ఎక్కడా ప్రదర్శించరాదని పేర్కొన్నారు.

11వ వార్డులో పారిశుధ్య పనులు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో 11 వార్డులో కౌన్సిలర్ ఆశి లీలారాణి ఆధ్వర్యాన మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు కాలువల్లోని చెత్త చెదారాలను తొలగించి దూర ప్రాంతానికి తరలించారు. అనంతరం కాలువల్లో, రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని టెక్కలిపట్నం పంచాయతీ గోపీవల్లభాపురంలో సర్పంచ్ ప్రతినిధి పానిల కృష్ణారావు ఆధ్వర్యాన నవధాన్యాలు సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ కార్యకర్త సిహెచ్.నాగరాజు మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో 365 రోజులు పంటలు పండించాలని, అందులో భాగంగా రైతుల తమ పొలాల్లో 18 నుంచి 31 రకాల విత్తనాలు పిఎండిఎస్ ఎకరాకు 12 నుంచి 13 కేజీలు వేయాలని రైతులకు వివరించారు. ఈ విధంగా వేయడం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం జీవవైవిధ్యం పెరిగి పంటలకు కావాల్సిన పోషకాలు అంది దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించామని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయరావు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు పోలుమహంతి జగన్మోహనరావు సూచనలు మేరకు రుధిర అనే కార్యక్రమం ద్వారా 120 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ చేశామని సంస్థ ప్రతినిధులు కె.సత్యనారాయణ, జి.పవన్‌కుమార్ తెలిపారు. విద్యార్థులంతా పోషక పదార్థాలు విటమిన్లు పుష్కలంగా లభించే ఆహారాన్ని తీసుకోవాలని అవగాహన కల్పించారు. రక్తహీనత వ్యాధిని బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు చిన్నారావు, లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి, రమేష్ సాహూ, వినోద్ రాజా, శ్రీనివాసరావు, విజయ, సంగీత, అప్పలనాయుడు పాల్గొన్నారు.

బ్లడ్ గ్రూప్ కార్డులను చూపిస్తున్న అధ్యాపకులు

'గౌతు' పేరు వింటేనే మంత్రికి వణుకు

ప్రజాశక్తి- పలాస

స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్నపై వైసిపి నాయకుల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడకల కామేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు మండిపడ్డారు. పలాస టిడిపి కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. అనేక పోరాటాలు చేసిన వ్యక్తిపై అన్నీ రాజకీయ పార్టీలు గౌరవిస్తున్నాయని అన్నారు. అటువంటి వ్యక్తులను వైసిపి నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. మంత్రి అప్పలరాజు తన అనుచరులతో తిట్టిస్తుండడంపై విచారం వ్యక్తం చేశారు. గౌతు అనే పదం వినిపిస్తే మంత్రి హడలిపోతున్నారని వాఖ్యానించారు. సమావేశంలో గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకరగుప్తా, బడ్డ నాగరాజు, జోగ మల్లి, టి.గంగారామ్, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

టెక్కలి రూరల్ : టెక్కలి డివిజనల్ పశుసంవర్ధశాఖ కార్యాలయంలో ఈ నెల 23న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో డివిజన్‌లో పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి గోపి

భోజనం నాణ్యతలో రాజీ వద్దు

జలుమూరు : జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని ఎంపిపి వాన గోపి అన్నారు. మండలంలోని బసివాడ పంచాయతీ పరిధి ఈదులవలసలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును మంగళవారం పరిశీలించారు. అనంతరం పాగోడు సచివాలయాన్ని సందర్శించి రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు శ్రేయస్సు ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు దామ మన్మథరావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు కాపులకు అన్యాయం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాల పునర్విభజన తర్వాత తూర్పు కాపులే అత్యధికంగా ఉన్నారని, ఆశగా ఎదురు చూసినా మండలి సీటు కూడా ఇవ్వకుండా సిఎం జగన్మోహనరెడ్డి అన్యాయం చేశారని తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆరోపించారు. నగరంలోని నాగావళి హోటల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 107 మంది ఎంపిటిసిలు, 8 మంది జెడ్‌పిటిసిలు ఉన్నారని, అయినా తూర్పు కాపులకు సీటు కేటాయించ లేదని అన్నారు. అందువల్ల మండలికి తూర్పు కాపుల నుంచి అభ్యర్థిని బరిలోకి దింపుతున్నామని స్పష్టం చేశారు. తూర్పు కాపులకు బలం ఉన్నచోట ధర్మాన సోదరులు అణగదొక్కి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జగన్ పునరాలోచన చేయాలని కోరారు.

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) ఆధ్వర్యాన మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 63మంది పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 47 మంది రాత పరీక్షలో పాల్గొన్నారు. వారి నుంచి మౌఖిక పరీక్ష ద్వారా 15 మందిని ఉద్యోగానికి ఎపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.పైడితల్లి, ఐక్యూ ఎసి సమన్వయకర్త డాక్టర్ శాంతిదేవి, నియామక ప్రతినిధులు శేషగిరిరావు, స్వాతి, తేజ, జెకెసి మెంటార్లు దామోదరరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.